


RNI: APTEL/2010/36742

# న్యూస్ వార్

వార్తా పత్రిక



విలేకరులు కావలెను

తెలుగు భాషపై పట్టు స్థానిక సమస్యలపై అవగాహన కలిగిన ఉత్సాహవంతులైన

యువతి యువకులకు జర్నలిస్టుగా పనిచేసేందుకు సదావకాశం

న్యూస్ వార్ దిన పత్రిక

నూతన ఒరవడి ప్రత్యేక కథనాలతో మీ ముందుకు వస్తున్న న్యూస్‌వార్ దిన పత్రికలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు,నియోజకవర్గాలు, మండల కేంద్రాలల్లో వార్తాసేకరణకు విలేకరులు కావలెను ఆసక్తి కలవారు ఈ క్రింది నెంబర్‌ను సంప్రదించండి.

94409 91979



నల్లగొండ | epaper.news war.com | ఆదివారం 24, మే 2026 | సంపుటి :16 సంచిక :57 | ఎడిటర్: కృష్ణారావు నటవ | పేజీలు : 4 , వెల.2.00




2

## 19వ రోజ్‌గార్ మేళా..

### మోదీ చేతుల మీదుగా

# 51వేల మందికి నియామక పత్రాలు

నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా చేపట్టిన రోజ్‌గార్ మేళా కార్యక్రమాన్ని కేంద్రం మరోసారి భారీఎత్తున నిర్వహించింది. దేశవ్యాప్తంగా 47 ప్రాంతాల్లో శనివారం ఈ కార్యక్రమం ఏకకాలంలో జరిగిం ది. 19వ రోజ్‌గార్ మేళా సందర్భంగా.. కొత్తగా ఎంపికైన 51వేల మంది అభ్యర్థులకు ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా నియామక పత్రాలు అందజేశారు. యువత సాధికారత, ఉపాధి కల్పనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మోదీ స్పష్టం చేశారు.ఈ నియామకాలు కేంద్ర ప్రభుత్వ శాఖల్లోని ఆయా విభాగాల్లో జరిగాయి.

## యాదగిరిగుట్టలో సీఎం

# రేవంత్ రెడ్డి..



- అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- టెంపుల్ సిటీలో వేద పాఠశాలకు శంకుస్థాపన
- అనంతరం నరసింహున్ని దర్శించుకున్న సీఎం

2లో..

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శనివారం యాదగిరిగుట్టలో పర్యటించారు. ఉదయం 8:50 నిమిషాలకు హెలికాప్టర్లో యాదగిరిగుట్టకు చేరుకున్న సీఎంరేవంత్ రెడ్డికి, మంత్రులు కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కి ప్రభుత్వ విప్ ఆలేర్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం నేరుగా టెంపుల్ సిటీలో 43 కోట్ల వ్యయంతో నిర్మించనున్న వేద పాఠశాల పనులకు కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతితో కలిసి సీఎం భూమి పూజ నిర్వహించారు. 100 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు కూడా ఆయన అక్కడే శంకుస్థాపన చేశారు.




### ఎనిమిది రోజుల వ్యవధిలోనే

# మూడు సార్లు ధరలు పెంచారు

- అధిక ధరలతో దేశ ప్రజలను బీజేపీ ప్రభుత్వం దోచుకుంటోంది
- ఇది ప్రజలను నిర్దాక్షిణ్యంగా దోచుకోవడమే
- ఈ దోపిడీ ద్వారా వస్తున్న సొమ్ము ఎవరికి చేరుతోంది?
- మోదీ ప్రభుత్వంలో నాయకత్వ సంక్షోభం
- పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి మోదీ ప్రభుత్వం దోచుకుంటోంది
- కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే

2వ పేజీ

కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను మరోసారి పెంచడంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎనిమిది రోజుల వ్యవధిలోనే మూడు సార్లు ధరలు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధిక ధరలతో దేశ ప్రజలను బీజేపీ ప్రభుత్వం దోచుకుంటోందని ఆరోపించారు.



### యువతకు మంచి

# భవిష్యత్తు ఇవ్వొద్దా..

## బీఆర్ఎస్‌పై మంత్రి శ్రీధర్ బాబు ఫైర్

బీఆర్ఎస్ పార్టీ నేతలపై మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు చీప్ పాలిటిక్స్.. బ్లాక్ మెయిల్ పాలిటిక్స్ చేయొద్దని అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఎక్కడ అభివృద్ధి చేస్తే అక్కడ ఆపుతామంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రజలు కోరుకున్నది తప్పకుండా చేసి తీరుతామన్నారు.

2



### వికసిత భారత్ లక్ష్యంలో యువతదే

# కీలక పాత్ర: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

దేశవ్యాప్తంగా 47 ప్రాంతాల్లో జరిగిన రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. శనివారం నాడు బోయిగూడలోని రైల్ కళారంగ్‌లో జరిగిన 19వ రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈరోజు 220 మంది కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్నారన్నారు. రోజ్‌గార్ మేళా ద్వారా ఇప్పటివరకు 12.5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని వెల్లడించారు.

2



# కాక్‌రోచ్ జనతా పార్టీ వెబ్‌సైట్ తొలగింపు..

2




### మోదీ ప్రభుత్వం రూ.1,047 లక్షల కోట్ల

# అప్పులు చేసింది: జగ్గారెడ్డి..

2

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపై తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయితేనే ఏపీకి ప్రత్యేక హోదా వస్తుందని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కోసమైనా రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని ఏపీ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.



# బీఆర్ఎస్‌లో హరీశ్‌రావు ఫ్యూచర్ ఏంటో ఆయనకే తెలియదు.. మంత్రి పొంగులేటి సెటైర్లు

2

మాజీమంత్రి హరీశ్‌రావుపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా నుంచి ఫ్యూచర్ సిటీని ఆపేస్తామంటూ హరీశ్‌రావు ఎలా మాట్లాడుతు న్నారని ప్రశ్నించారు.



# 19వ రోజ్‌గార్ మేళా.. మోదీ చేతుల మీదుగా 51వేల మందికి నియామక పత్రాలు

ఇంటర్నెట్ డెస్క్: న్యూస్‌వార్ ప్రతినిధి

నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా చేపట్టిన రోజ్‌గార్ మేళా కార్యక్రమాన్ని కేంద్రం మరోసారి భారీఎత్తున నిర్వహించింది. దేశవ్యాప్తంగా 47 ప్రాంతాల్లో శనివారం ఈ కార్యక్రమం ఏకకాలంలో జరిగిం ది. 19వ రోజ్‌గార్ మేళా సందర్భంగా.. కొత్తగా ఎంపికైన 51వేల మంది అభ్యర్థులకు ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా నియామక పత్రాలు అందజేశారు. యువత సాధికారత, ఉపాధి కల్పనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మోదీ స్పష్టం చేశారు. ఈ నియామకాలు కేంద్ర ప్రభుత్వ శాఖల్లోని ఆయా విభాగాల్లో జరిగాయి. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఎంపికైన అభ్యర్థులు విధులు నిర్వహించనున్నారు. ప్రభుత్వ సేవల్లోకి అడుగుపెడుతున్న యువత దేశ అభివృద్ధిలో కీలక భాగస్వాములవుతారని ప్రధాని పేర్కొన్నారు. 'భారతదేశం ప్రపంచ సాంకేతిక రంగంలో వేగంగా ఎదుగుతోంది. నైపుణ్యాలు కలిగిన యువతకు దేశంలోనే కాకుండా విదేశాల్లోనూ విస్తృత అవకాశాలు లభిస్తున్నాయి. రైల్వే, బ్యాంకింగ్, రక్షణ, ఆరోగ్యం, విద్య తదితర రంగాల్లో కొత్త బాధ్యతలు చేపట్టనున్న యువత వికసిత భారత్ లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషిస్తోంది' అని యువతను ఉద్దేశించి ప్రసంగించారు మోదీ.కాగా.. 2022లో రోజ్‌గార్ మేళా కార్యక్రమాన్ని ప్రారంభించింది కేంద్రం. దీని ద్వారా ఉద్యోగ నియామక ప్రక్రియను వేగవంతం చేయడం సహా ఖాళీలను త్వరితగతిన భర్తీ చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు దేశవ్యాప్తంగా సుమారు 12 లక్షల నియామకాలు చేపట్టినట్టు కేంద్రం వెల్లడించింది.

# ఎనిమిది రోజుల వ్యవధిలోనే మూడు సార్లు ధరలు పెంచారు

అధిక ధరలతో దేశ ప్రజలను బీజేపీ ప్రభుత్వం దోచుకుంటోంది

ఇది ప్రజలను నిర్దాక్షిణ్యంగా దోచుకోవడమే

ఈ దోపిడీ ద్వారా వస్తున్న సొమ్ము ఎవరికి చేరుతోంది?

మోదీ ప్రభుత్వంలో నాయకత్వ సంక్షోభం

పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి మోదీ ప్రభుత్వం దోచుకుంటోంది

కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే

ఢిల్లీ: న్యూస్‌వార్ ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను మరోసారి పెంచడంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎనిమిది రోజుల వ్యవధిలోనే మూడు సార్లు ధరలు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధిక ధరలతో దేశ ప్రజలను బీజేపీ ప్రభుత్వం దోచుకుంటోందని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్‌పై రోజువారీగా రూ.1,000 కోట్ల పన్నులను కేంద్రం విధిస్తోందని.. అయినా మోదీ ప్రభుత్వానికి అత్యాశ తీరలేదని ఖర్గే విమర్శించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు తక్కువగా ఉన్నప్పటికీ.. ఆ ప్రయోజనాలను దేశ ప్రజలకు అందించలేదని ఖర్గే నిప్పులు చెరిగారు. ఇది ప్రజలను నిర్దాక్షిణ్యంగా దోచుకోవడమేనని మండిపడ్డారు. సంక్షోభం వచ్చినప్పుడు ఎన్నికల ప్రచారంలో బీజేపీ మునిగిపోయిందని, ఆ తర్వాత ఇప్పుడు త్యాగం గొప్పతనం గురించి చెబుతోందని ఆయన విమర్శించారు. ఇతర దేశాలతో పోలిస్తే భారతదేశంలో ఇంధన ధరలు అత్యంత తక్కువగా ఉన్నాయని కమలం పార్టీ నేతలు చెబుతున్నారని ఖర్గే ఆగ్రహించారు. పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైన తర్వాత అంతా బాగానే ఉందని భారతీయులకు ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారని అన్నారు. కానీ అదే సమయంలో ఇతర దేశాలు తమ పౌరులకు చురుకుగా సహాయాన్ని అందించాయని మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు. ఇంధనంపై ఇటలీ ఎక్సైజ్ సుంకాలను తగ్గించి పౌరులకు ఉపశమనం కలిగించిందని చెప్పారు. ఆస్ట్రేలియాలో ఎక్సైజ్ సుంకం తగ్గించడంతో పెట్రోల్ ధరలు లీటరుకు సుమారు రూ.17 తగ్గాయని ఆయన తెలిపారు. చమురుపై జర్మనీ పన్నులు తగ్గించడంతో ఇంధన ధరలు లీటరుకు రూ.17 నుంచి రూ.19 వరకు తగ్గిపోయాయని వెల్లడించారు. అలాగే యూకేలో ప్రతి ఇంటికీ చమురు సంబంధిత ఆర్థిక సహాయంగా ప్రభుత్వం 100 పౌండ్లు అందించడంతో పాటు ఇంధనం, విద్యుత్ రెండింటిపైనా పన్నులను తగ్గించిందని ఖర్గే చెప్పుకొచ్చారు. ఐర్లాండ్ 250 మిలియన్ యూరోలను సాయం కింద ప్రజలకు అందించిందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు తెలిపారు. దీంతో పెట్రోల్ ధర లీటరుకు సుమారు 0.15 యూరోలు, డీజిల్ ధర లీటరుకు 0.20 యూరోలు తగ్గాయని చెప్పారు. మన దేశంలో మాత్రం రేట్లు పెంచుతూ దోపిడీ చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దోపిడీ ద్వారా వస్తున్న సొమ్ము ఎవరికి చేరుతోంది? అంటూ ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వంలో నాయకత్వ సంక్షోభం చాలా స్పష్టంగా కనిపిస్తోందని, ఈ విషయాన్ని ఇప్పుడు 140 కోట్ల మంది భారతీయులు గ్రహించారని మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు.

# కాక్‌రోచ్ జనతా పార్టీ వెబ్‌సైట్ తొలగింపు..

కేంద్రంపై అభిజీత్ దీప్కే మండిపాటు..

యువతలో విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్న ఫేమస్ సోషల్ మీడియా పేజీ 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ – జజ్పీ) కి మరో షాక్ తగిలింది. ఇప్పటికే ఎక్స్ అకౌంట్ నిలిపివేత, ఇన్‌స్టాగ్రామ్ హ్యాకింగ్ ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఇప్పుడు పార్టీ అధికారిక వెబ్‌సైట్ కూడా పనిచేయడం ఆగిపోయింది. ఈ ఘటనపై స్పందించిన పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. 'ప్రభుత్వం కాక్‌రోచ్‌లకు ఎందుకు భయపడుతోంది? ఇది నియంతృత్వ ధోరణి' అంటూ సోషల్ మీడియాలో వ్యాఖ్యానించారు. అలాగే 'కాక్‌రోచ్‌లు ఎప్పుడూ చావవు' అంటూ కొత్త ప్లాట్‌ఫామ్‌పై పని చేస్తున్నామని తెలిపారు. తమను అణచివేసే కుట్ర జరుగుతోందని అభిజిత్ దిప్కే ఆరోపణలు చేశారు. 'కాక్రోచ్ జనతా పార్టీ' ఒక సోషల్ మీడియా ఉద్యమంగా ప్రారంభమైంది. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, పరీక్షల లీకులు, యువత సమస్యలపై సెటైరికల్ పోస్టులతో ఈ ఉద్యమం తక్కువ సమయంలోనే భారీ ఫాలోయింగ్ సంపాదించింది. ఇన్‌స్టాగ్రామ్‌లో కోట్లాది మంది ఫాలోవర్లు రావడంతో దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇటీవల పార్టీ ఎక్స్ అకౌంట్‌ను ఇండియాలో నిలిపివేయడం, ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ హ్యాక్ అయిందని ఆరోపణలు రావడం సంచలనంగా మారింది. ఈ పరిణామాలపై సోషల్ మీడియాలో విభిన్న స్పందనలు వస్తున్నాయి. కొందరు దీన్ని భావ ప్రకటన స్వేచ్ఛపై దాడిగా విమర్శిస్తుండగా, మరికొందరు ఇది కేవలం వైరల్ రాజకీయ వ్యంగ్య ప్రచారమేనని అభిప్రాయపడుతున్నారు.




# యాదగిరిగుట్టలో సీఎం రేవంత్ రెడ్డి..

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

టెంపుల్ సిటీ లో వేద పాఠశాలకు శంకుస్థాపన

అనంతరం నరసింహున్ని దర్శించుకున్న సీఎం

యాదగిరిగుట్ట : న్యూస్‌వార్ ప్రతినిధి



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శనివారం యాదగిరిగుట్టలో పర్యటించారు. ఉదయం 8:50 నిమిషాలకు హెలికాప్టర్లో యాదగిరిగుట్టకు చేరుకున్న సీఎంరేవంత్ రెడ్డికి, మంత్రులు కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కి ప్రభుత్వ విప్ ఆలేర్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం నేరుగా టెంపుల్ సిటీలో 43 కోట్ల వ్యయంతో నిర్మించనున్న వేద పాఠశాల పనులకు కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతితో కలిసి సీఎం భూమి పూజ నిర్వహించారు. 100 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు కూడా ఆయన అక్కడే శంకుస్థాపన చేశారు. అనంతరం యాదగిరి కొండపైకి చేరుకున్న సీఎంకి ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వయంభులను దర్శనం చేసుకున్న అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనం చేపట్టారు. దేవస్థానం ఈవో భవాని ప్రసాద్ ధర్మకర్త నర్సింహమూర్తిలు సీఎంకి మంత్రులకు స్వామి వారి జ్ఞాపికను ప్రసాదాలను అందజేశారు. దర్శన అనంతరంలో సీఎం హైదరాబాద్ కు వెళ్లారు.





# యువతకు మంచి భవిష్యత్తు ఇవ్వొద్దా..

బీఆర్ఎస్‌పై మంత్రి శ్రీధర్ బాబు ఫైర్

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

బీఆర్ఎస్ పార్టీ నేతలపై మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు చీప్ పాలిటిక్స్.. బ్లాక్ మెయిల్ పాలిటిక్స్ చేయొద్దని అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఎక్కడ అభివృద్ధి చేస్తే అక్కడ ఆపుతామంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రజలు కోరుకున్నది తప్పకుండా చేసి తీరుతామన్నారు. వేలాది కోట్లు పెడతామని మల్టీ నేషనల్ కంపెనీలు వస్తున్నాయని.. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటే పెట్టుబడిదారులు భయపడరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ తెచ్చిన మెట్రోనే ముందుకు సాగిందని మంత్రి తెలిపారు. తాము ఎన్ని కిలోమీటర్లు తెచ్చామో అన్ని కిలోమీటర్లు మాత్రమే మెట్రో వచ్చిందని చెప్పారు. మెట్రోను విస్తరిద్దామంటే అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. పెరిగిన జనాభాకి అనుగుణంగా మెట్రో విస్తరించకూడదా అని ప్రశ్నించారు. మాజీ మంత్రి హరీశ్ రావు పగటి కలలు కంటున్నారని విమర్శించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలా? వద్దా? హరీశ్ రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయిందని.. అయినా ఆ పార్టీ నేతల బుద్ధి మారడం లేదని వ్యాఖ్యానించారు.నగరాన్ని విస్తీర్ణం చేయాలని ప్రభుత్వం భావిస్తోందని మంత్రి తెలిపారు. ప్రజల అవసరాలను తీర్చడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇతర నగరాల అభివృద్ధిపై అధ్యయనం చేశామన్నారు. రాబోయే తరాలకు ఉపయోగపడే కార్యాచరణ తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడానికే బీఆర్ఎస్ ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని మంత్రి ఆరోపించారు. ఓటమితో ఎదురైన నిరాశ నుంచి ఇప్పటికీ బయటకి రాలేకపోతున్నారన్నారు. బుల్లెట్ ట్రైన్ తెస్తామంటే.. ఎందుకని బీఆర్ఎస్ నేతలు అడ్డుపడుతున్నారని ఫైర్ అయ్యారు. తెలంగాణ యువతకు మంచి భవిష్యత్తు ఇవ్వొద్దా అని అన్నారు. స్వార్థ రాజకీయాలే తమకి ముఖ్యమని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు విరుచుకుపట్టారు.

# మోదీ ప్రభుత్వం రూ.1,047 లక్షల కోట్ల అప్పులు చేసింది: జగ్గారెడ్డి..

హైదరాబాద్: న్యూస్‌వార్ ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపై తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయితేనే ఏపీకి ప్రత్యేక హోదా వస్తుందని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కోసమైనా రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని ఏపీ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఆలోచన చేయాలని.. ఓటు ఎవరికో వేసి దేవుడిని ఏదో అడిగితే ఎవరూ ఏం చేయలేరని అన్నారు. హైదరాబాద్ గాంధీ భవన్‌లో జగ్గారెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీకి ప్రత్యేక హోదా సహా పలు అంశాలపై స్పందించారు.తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మాట్లాడుతూ.. 'భక్తి అంటే నాది.. నేను రియల్ ఎస్టేట్‌లో సంపాదించిన డబ్బులతో సీతారాముల కల్యాణం చేస్తాను. తెలంగాణలో ఒక్క బీజేపీ నేత అయినా నాలాగా చేస్తారా?. రాములవారి కల్యాణం చేసి నేనెప్పుడైనా ఓట్లు అడిగానా?. ఛత్రపతి శివాజీకి లేని మతం మీకెందుకు?. శివాజీ దగ్గర ముస్లింలు మంత్రులుగా పనిచేశారు. బీజేపీ నేతలు చదువుకోవాలి. ఆ పార్టీ వాళు మాట్లాడితే హిందువులు అంటారు. రాజ్యాంగాన్ని తీసేసే కుట్ర బీజేపీ చేస్తోంది. రాజ్యాంగ పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ పాటుపడుతున్నారు. ఆయన ఎక్కడికి వెళ్లినా ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

# వికసిత భారత్ లక్ష్యంలో యువతదే కీలక పాత్ర: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

దేశవ్యాప్తంగా 47 ప్రాంతాల్లో జరిగిన రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. శనివారం నాడు బోయిగూడలోని రైల్ కళారంగ్‌లో జరిగిన 19వ రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈరోజు 220 మంది కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్నారన్నారు. 2022లో దీపావళి రోజున మొదలైన రోజ్‌గార్ మేళా ద్వారా ఇప్పటివరకు 12.5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని వెల్లడించారు. ఇది కేవలం ఉద్యోగాల కార్యక్రమం కాదని, యువత భవిష్యత్తు కోసం మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన పెద్ద మిషన్ అని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ కంపెనీల్లో కూడా కోట్ల సంఖ్యలో ఉద్యోగాలు వస్తున్నాయని అన్నారు.

**స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా యువతకు శిక్షణ..**

స్టార్టప్స్, యూనికార్న్లు వల్ల యువత ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి వచ్చిందని కేంద్రమంత్రి అన్నారు. రోడ్లు, ఎయిర్‌పోర్టులు, రైల్వేలు, మెట్రోలు, ఇండస్ట్రియల్ కారిడార్లు వంటి ప్రాజెక్టులతో భారీగా ఉపాధి పెరుగుతోందన్నారు. దేశంలో ప్రతి సంవత్సరం రూ.12 లక్షల కోట్ల ఇన్‌ఫ్రా పనులు జరుగుతున్నాయని వివరించారు. ప్రతి లక్ష కోట్ల పెట్టుబడికి 14 నుంచి 15 లక్షల ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. యువతను మోదీ 'వికసిత భారతానికి సూపర్ హీరోలు'గా చూస్తున్నారని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా కోట్ల మంది యువతకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. గ్రామీణ యువతకు కూడా×, ×శీ వంటి ఆధునిక టెక్నాలజీని మాతృభాషలో నేర్పిస్తున్నామని తెలిపారు.

**అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్...**

భారత యువత ప్రపంచస్థాయిలో రాణిస్తోందని కిషన్ రెడ్డి అన్నారు. సెమీకండక్టర్లు, స్పేస్, డ్రోన్ టెక్నాలజీలో భారత్ ముందుకు వెళ్తోందన్నారు. చంద్రుడి దక్షిణ ధృవానికి ముందుగా చేరిన దేశం భారత్ అని చెప్పుకొచ్చారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో స్వదేశీ డ్రోన్లు శత్రు క్షిపణులను అడ్డుకున్నాయని అన్నారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్య సాధనలో యువత పాత్ర కీలకమన్నారు. యూనివర్సిటీలు, కాలేజీలు, పీఎం-శ్రీ స్కూల్స్ సంఖ్య పెంచామని తెలిపారు. భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని అన్నారు. 2014కు ముందు వందల స్టార్టప్స్ మాత్రమే ఉండగా, ఇప్పుడు 1.2 లక్షలకు పైగా ఉన్నాయన్నారు. మైనింగ్, బొగ్గు రంగాల్లో కూడా మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని యువతకు సూచించారు. మైనింగ్, ఇంజనీరింగ్ వంటి కోర్సులపై యువత దృష్టి సారించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సూచనలు చేశారు.

# బీఆర్ఎస్‌లో హరీశ్‌రావు ఫ్యూచర్ ఏంటో ఆయనకే తెలియదు.. మంత్రి పొంగులేటి సెటైర్లు

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

మాజీమంత్రి హరీశ్‌రావుపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా నుంచి ఫ్యూచర్ సిటీని ఆపేస్తామంటూ హరీశ్‌రావు ఎలా మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పొంగులేటి పోస్టు పెట్టారు. బీఆర్ఎస్‌లో హరీశ్‌రావు ఫ్యూచర్ ఏంటో ఆయనకే తెలియదు అంటూ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఫ్యూచర్ సిటీ భూములపై అమెరికాలో ఎవరికైనా ఒప్పందాలు చేసుకున్నా రా..? అంటూ నిలదీశారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో ఒక్క మెట్రోస్టేషన్ కూడా ఎందుకు పూర్తిచేయలేదని ప్రశ్నల వర్షం కురిపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా కొత్త నగరాన్ని నిర్మిస్తోందని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు. కేసీఆర్ కుటుంబం ఫాంహౌస్‌లు కట్టుకుందని.. కానీ తాము రాష్ట్ర భవిష్యత్తు కోసం ఫ్యూచర్ సిటీ కడుతున్నామని ఉద్ఘాటించారు. మూసీప్రక్షాళన, లగచర్ల ఇండస్ట్రీస్‌కు బీఆర్ఎస్ నేతలు అడ్డుపడ్డారని ఆగ్రహించారు.


న్యూస్ వార్ వార్తా పత్రిక

**సంపాదకీయం...**

# జీవవైవిధ్య పరిరక్షణతోనే సుస్థిర అభివృద్ధి

**జీవవైవిధ్యంపై అంతర్జాతీయ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం మే 22న ప్రకృతిని, జీవరాశులను సంరక్షించాల్సిన అవసరంపై అవగాహన కల్పించడానికి జరుపుకుంటారు. జీవవైవిధ్యం అంటే భూమిపై జీవించేందుకు సహాయపడే మొక్కలు, జంతువులు, సూక్ష్మజీవులు, పర్యావరణ వ్యవస్థలు. 2026 సంవత్సరానికి జీవవైవిధ్య దినోత్సవ థీమ్ స్థానికంగా చర్యలు తీసుకుని ప్రపంచస్థాయిలో ప్రభావం చూపడం గా ఉంది. ఇది చిన్నచిన్న స్థానిక చర్యలు కూడా ప్రపంచవ్యాప్తంగా సానుకూల మార్పులు తీసుకురాగలవని సూచిస్తుంది. జీవవైవిధ్యం మనిషి జీవనానికి అవసరమైన ఆహారం, ఔషధాలు, శుద్ధమైన నీరు, ఇంధనం, ముడి పదార్థాలను అందిస్తుంది. అడవులు, సముద్రాలు, తేమభూములు, గడ్డిభూములు వాతావరణాన్ని నియంత్రించడంలో, మట్టిలో సారాన్ని నిలుపుకోవడంలో, ప్రకృతి విపత్తులను తగ్గించడంలో సహాయపడతాయి.**

సుస్థిర అభివృద్ధి జీవవైవిధ్యంపై ఆధారపడి ఉంటుంది. ఎందుకంటే ఆరోగ్యకరమైన పర్యావరణ వ్యవస్థలు ఆర్థిక అభివృద్ధికి, మానవ సంక్షేమానికి మద్దతు ఇస్తాయి. జీవవైవిధ్య సంరక్షణ వ్యవసాయం, పర్యాటకం ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ప్రజల జీవనోపాధిని కూడా మద్దతు ఇస్తుంది. సంయుక్త రాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు పర్యావరణ వ్యవస్థల సంరక్షణను, వనరుల బాధ్యతాయుత వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాయి. జీవవైవిధ్య నష్టం సుస్థిర అభివృద్ధి, మానవ జీవనంపై ప్రభావం చూపుతున్న ఒక ప్రధాన ప్రపంచ సమస్యగా మారుతోంది. ఐక్యరాజ్యసమితి ప్రకారం, అటవీ విధ్వంసం, కాలుష్యం, వాతావరణ మార్పు, సహజ వనరుల అధిక వినియోగం వంటి మానవ కార్యకలాపాల కారణంగా ప్రస్తుతం సుమారు 10 లక్షల జీవజాతులు అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయి. కేవలం అటవీ నాశనం వల్లనే ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం దాదాపు 10 మిలియన్ హెక్టార్ల అటవీభూమి నష్టపోతుంది. ఎందుకంటే ప్రపంచ ఆహార పంటల్లో సుమారు 75% తేనెటీగలు, సీతాకోకచిలుకలు వంటి పరాగ సంపర్కకారులపై ఆధారపడి ఉంటాయి; ఇవి వేగంగా తగ్గిపోతున్నాయి. సముద్ర జీవవైవిధ్యం తగ్గడంవల్ల సముద్రాలపై ఆహారం, ఆదాయానికి ఆధారపడే 3 బిలియన్లకుపైగా ప్రజల జీవనోపాధి ప్రభావితమవుతుంది. జీవవైవిధ్య నష్టం పర్యావరణ వ్యవస్థలను బలహీనపరచి వరదలు, కరవులు, ప్రకృతి విపత్తుల ప్రమాదాన్ని పెంచుతుంది. ఇది వ్యవసాయం, పర్యాటకం, మత్స్య పరిశ్రమ, ఆరోగ్య సంరక్షణ రంగాలపై కూడా ప్రతికూల ప్రభావం చూపి సుస్థిర అభివృద్ధిని మందగింపజేస్తుంది. శాస్త్రవేత్తల అంచనా ప్రకారం, పర్యావరణ వ్యవస్థల నష్టం భవిష్యత్తులో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రతి సంవత్సరం ట్రిలియన్ల డాలర్ల నష్టాన్ని కలిగించవచ్చు. బ్రెజిల్, ఇండోనేషియా, కొలంబియా, భారతదేశం, ఆస్ట్రేలియా వంటి దేశాలు అత్యధిక జీవవైవిధ్యం కలిగిన దేశాలుగా ప్రసిద్ధి చెందాయి. ఎందుకంటే ఇవి ఉష్ణమండల అడవులు, ప్రత్యేకమైన వన్యప్రాణులు, విభిన్న పర్యావరణ వ్యవస్థలను కలిగి ఉన్నాయి. ప్రపంచంలో తెలిసిన జీవజాతుల్లో సుమారు 10% ఉన్నాయి. విస్తారమైన అమెజాన్ వర్షారణ్యం ఉంది. కొలంబియా ప్రపంచంలోనే అత్యధిక పక్షిజాతులను కలిగి ఉన్న దేశం, అక్కడ 1,900 కంటే ఎక్కువ పక్షిజాతులు నమోదు అయ్యాయి. భారతదేశం 17 మెగా –వైవిధ్య దేశాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ఇండోనేషియా సముద్ర జీవవైవిధ్యంలో అత్యంత సంపన్న దేశాలలో ఒకటి, అక్కడ 3,000 కంటే ఎక్కువ చేపల జాతులు ఉన్నాయి. మరోవైపు, తీవ్రమైన జీవవైవిధ్య నష్టాన్ని ఎదుర్కొంటున్న దేశాల్లో హైతి, మడగాస్కర్ , అఫ్ఘనిస్తాన్ ఉన్నాయి. ఇవి అటవీ విధ్వంసం, నివాస స్థలాల నాశనం, వాతావరణ మార్పు కాలుష్యం కారణంగా ఈ పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. హైతి తన అసలు అటవీ కవచంలో దాదాపు 98% కోల్పోయింది. ఇది తీవ్రమైన పర్యావరణ నష్టానికి దారితీసింది. మడగాస్కర్‌లో 90% కంటే ఎక్కువ ప్రత్యేక జీవజాతులు ఉన్నాయి. పట్టణీకరణ కారణంగా సహజ నివాసాలు, జీవవైవిధ్యం తగ్గిపోయింది. కొనసాగుతున్న జీవవైవిధ్య నష్టం ప్రపంచవ్యాప్తంగా ఆహార భద్రత, శుద్ధమైన నీరు, వాతావరణ సమతుల్యత, సుస్థిర అభివృద్ధిని ప్రమాదంలోకి నెట్టవచ్చు. ప్రపంచవ్యాప్తంగా జీవవైవిధ్యాన్ని రక్షించడానికి, పర్యావరణ వ్యవస్థలను సంరక్షించడానికి అనేక అంతర్జాతీయ సంస్థలు చురుకుగా పనిచేస్తున్నాయి. ప్రకృతి, వన్యప్రాణుల సంరక్షణ కోసం పనిచేసే అంతర్జాతీయ సంస్థ (డబ్లుడబ్లుఎఫ్) 100 కంటే ఎక్కువ దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. మరిన్ని కనుగొనండి తెలంగాణ వార్తలు జిల్లా వార్తలు బ్రేకింగ్ న్యూస్ ప్రకృతి, జీవవైవిధ్య



పరిరక్షణ కోసం పనిచేసే అంతర్జాతీయ సంస్థ (ఐయుసిఎన్) రెడ్ లిస్ట్‌ను నిర్వహిస్తుంది, ఇందులో 1,60,000 కంటే ఎక్కువ జీవజాతులను అంచనా వేయగా, వాటిలో 44,000 కంటే ఎక్కువ జాతులు ప్రమాదంలో ఉన్నవిగా వర్గీకరించబడ్డాయి. జీవవైవిధ్యంపై అంతర్జాతీయ ఒప్పందం (సిబిడి)కి 196 సభ్యదేశాలు ఉన్నాయి, ఇవి జీవవైవిధ్యాన్ని సంరక్షించడానికి, సహజ వనరులను సుస్థిరంగా వినియోగించడానికి కలిసి పనిచేస్తున్నాయి. గ్రీన్‌పీస్ అటవీ విధ్వంసం, కాలుష్యం, వాతావరణ మార్పుకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తూ పర్యావరణ వ్యవస్థలను రక్షిస్తోంది. వన్యప్రాణి సంరక్షణ సంఘం (డబ్లుసిఎస్) సుమారు 60 దేశాల్లో సంరక్షణ ప్రాజెక్టులను నిర్వహిస్తూ ముఖ్యమైన వన్యప్రాణి నివాసాలను కాపాడుతోంది. ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎఒ) సుస్థిర వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ ఆహార భద్రతకు అవసరమైన పంటల వైవిధ్యాన్ని సంరక్షించడంలో సహాయపడుతోంది.

# హత్యారాజకీయాలు జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య

### జగన్ చరిత్ర తెలిసిన వారికి ఇవన్నీ అర్థం అవుతాయి
### వైఎస్ మరణం, వివేకా మరణంపై జగన్‌వైపే అనుమానాలు
### జగన్ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించిన మంత్రి అచ్చన్నాయుడు

**అమరావతి,**

హత్యా రాజకీయాలు, అక్రమాల్లో ఆరితేరిన ఘనుడు జగన్ అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయన చరిత్ర చూస్తే ఇదే కనిపిస్తుందని అన్నారు. ఇటీవల వైఎస్ జగన్ ఇమీడియా సమావేశంలో చేసిన కొన్ని సంచలన వ్యాఖ్యలపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తమ కుటుంబంలో జరిగిన మరణాలకు సీఎం చంద్రబాబు నాయుడే కారణమంటూ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ప్రవర్తన చూస్తుంటే 'అపరిచితుడు' సినిమా పాత్ర గుర్తుకొస్తోందని ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్ తాత వైఎస్ రాజారెడ్డిని ఎందుకు హత్య చేశారో ఈ రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరికీ తెలుసని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. వైఎస్ కుటుంబం నడిపిన దమనకాండను, అరాచకాలను ఆనాటి బాధితుడు పార్థసారథిరెడ్డి స్వయంగా వివరించారని గుర్తుచేశారు. రాజారెడ్డి హత్య కేసులో నిందితులుగా ఉన్న వారందరినీ కాలక్రమేణా తుదముట్టించారు. అయితే, రాజారెడ్డి హత్యకేసులో ఉన్న వ్యక్తి ఇవాళ వైసీపీలోనే కొనసాగుతుండటం.. జగన్ ద్వంద్వ నీతికి నిదర్శనమని విమర్శించారు. వైఎస్ కుటుంబానికి ఉన్న క్రూరత్వం, అరాచకాల చరిత్ర ప్రస్తుత తరానికి పూర్తిగా తెలియాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అసెంబ్లీలో చంద్రబాబు నాయుడు మాట్లాడిన రెండు రోజులకే వైఎస్ రాజశేఖరరెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోయారంటూ జగన్ చేస్తున్న ప్రచారం సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు. ఆనాడు అసెంబ్లీలో చంద్రబాబు మాట్లాడిన మాటల అసలు సందర్భాన్ని వివరిస్తూ.. తిరుమల వేంకటేశ్వర స్వామికి ఎవరైనా కీడు తలపెడితే వారికి ఎప్పటికీ మంచి జరగదు అని మాత్రమే చంద్రబాబు అన్నారని గుర్తు చేశారు. ఆ మాటలను జగన్ ఇవాళ తన స్వార్థం కోసం వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. గతంలో వైఎస్సార్ మరణం వెనుక 'రిలయన్స్' సంస్థ పాత్ర ఉందంటూ నానా హంగామా చేసి.. ఇప్పుడు చంద్రబాబును లాగడంలో అర్థం లేదన్నారు. ఇప్పటికైనా జగన్ ఇలాంటి వక్రీకరణలు మానుకోవాలని హితవు పలికారు. జగన్ బాబాయ్, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి ఎలా చనిపోయారో, ఆ హత్య వెనుక ఎవరున్నారో రాష్ట్ర ప్రజలందరికీ స్పష్టంగా తెలుసని అచ్చెన్నాయుడు అన్నారు. మొదట గుండెపోటు అని నమ్మించే ప్రయత్నం చేసి, ఆపై గొడ్డలితో నరికి చంపిన చరిత్ర వారిదేనని, అందుకే వైసీపీని తాము 'గొడ్డలి పార్టీ' అని పిలుస్తున్నామని స్పష్టం చేశారు. ఐదేళ్లు అధికారంలో ఉండి కూడా వివేకా హంతకులను ఎందుకు పట్టుకోలేకపోయారో జగన్ సమాధానం చెప్పాలని నిలదీశారు. వివేకానంద కూతురు సునీతను అడిగితే నిజాలు చెబుతుందన్నారు. హత్యారాజకీయాల్లో ఆరితేరిన జగన్ వైఎస్ మరణంలోనూ పాత్ర ఉందని ఆనాడు లోకం కోడై కూసిందన్నారు.




# మావిగన్ పేరుతో మభ్యపెట్టే యత్నం

### ఐదేళ్లలో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన జగన్
### గొడ్డలి పార్టీ నాయకుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
### గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

**కర్నూలు,**

మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి గడిచిన ఐదేళ్లలో అమరావతిని నాశనం చేయడమే కాకుండా.. ప్రస్తుతం మావిగన్ పేరుతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. శుక్రవారం తుగ్గలి మండలం జొన్నగిరిలో టీడీపీ కార్యకర్తల సమావేశంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని అన్ని విధాలుగా భ్రష్టు పట్టించిన వైకాపా.. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక పోతున్నారన్నారు. గొడ్డలి పార్టీ నాయకుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత తెదేపా శ్రేణులపై ఉందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెదేపా అభ్యర్థులు విజయం సాధించేలా కృషి చేయాలని పార్టీ నేతలకు మంత్రి సూచించారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రానికి పెట్టుబడి పెట్టాలంటే ఎవరు రాలేని పరిస్థితి ఉండేదని మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. ఇప్పుడు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు పోటీపడి ముందుకు వస్తున్నారన్నారు. గత ప్రభుత్వంతో పోలిస్తే మైనింగ్ శాఖలో రూ. 4 వేల కోట్లు అధికంగా రాబడి వచ్చిందని తెలిపారు. చంద్రబాబు నాయుడు పరిపాలన విధానాన్ని చూసి భారత దేశంలో వచ్చిన పెట్టుబడులలో 25 శాతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వచ్చాయని అన్నారు. జొన్నగిరిలో జియో మైసూర్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ సంస్థ.. బంగారు శుద్ధి, ఉత్పత్తికి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యంత్ర సామాగ్రిని ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఒకటన్ను ముడి సరుకు నుంచి ఒక గ్రాము బంగారం వస్తుందన్నారు. ప్రస్తుతం 300 మీటర్ల వరకు తవ్వారని... భవిష్యత్తులో రెండు కిలోమీటర్ల వరకు తవ్వకాలు జరుపనున్నట్లు చెప్పారు. దేశంలోనే మొట్టమొదటి ప్రైవేట్ గోల్డ్ మైన్స్ ప్రాజెక్టు



ఇది అని అన్నారు. అనంతపురం జిల్లా రామగిరి ప్రాంతంలో కూడా గోల్డ్ మైన్స్‌ను గుర్తించినట్లు తెలిపారు. బీచ్ శాండ్ ద్వారా ఖనిజ సంపదను గుర్తించడం జరిగిందన్నారు. గ్రానైట్, క్వార్ట్జ్‌కు బాగా డిమాండ్ ఉందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వంలో మైనింగ్ దోపిడీ జరిపి జేబులు నింపుకున్నారని కొల్లు రవీంద్ర ఆరోపించారు. జియో మైసూర్ గోల్డ్ మైనింగ్ పరిశ్రమను వచ్చే నెల 27న సీఎం చంద్రబాబు ప్రారంభోత్సవం చేస్తారని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాం కుమార్ వెల్లడించారు. ఈ సమావేశంలో పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, తెదేపా జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ తుగ్గలి నాగేంద్ర, నాయకులు సాంబశివారెడ్డి మనోహర్ చౌదరి, పురుషోత్తం చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్లపై జగన్ అబద్ధాల ప్రచారం

### వైసిపి హాయంలోనే 11 లక్షలు తొలగింపు
### మండిపడ్డ మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**అమరావతి,**

పెన్షన్‌లపై మాజీ సీఎం వైఎస్ జగన్ అవాస్తవాలు మాట్లాడుతున్నారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మండిపడ్డారు. ఈ మేరకు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు హయాంలో 6 లక్షల పెన్షన్లు తొలగించారని జగన్ పచ్చి అబద్ధం చెప్పారన్నారు. జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో ఏకంగా 11 లక్షల మంది నిరుపేదల పెన్షన్లను నిర్దాక్షిణ్యంగా తొలగించిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో మృతిచెందిన వారి పెన్షన్లు మాత్రమే రద్దయ్యాయని వివరించారు. కూటమి ప్రభుత్వంలో 22 నెలల్లో కొత్తగా 2.50 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేస్తే.. 6 లక్షల పెన్షన్లు తొలగించారని జగన్ అబద్ధాలు మాట్లాడుతున్నారని మంత్రి ÷ర్ అయ్యారు. ఐదేళ్ల జగన్ ప్రభుత్వంలో పెన్షన్ల కోసం రు.91 వేల కోట్లు ఖర్చు చేస్తే.. కూటమి ప్రభుత్వంలో 22 నెలల్లోనే రికార్డు స్థాయిలో రూ.63,157 కోట్లు ఖర్చు చేసిందని వెల్లడించారు. జగన్ రెడ్డి అబద్ధపు ప్రచారాలను రాష్ట్ర ప్రజలు ఎవరూ నమ్మవద్దని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు

# రెండో వారం 'నో వెహికల్ డే' పాటించిన నిమ్మల

### పాలకొల్లు నుంచి రైలులో విజయవాడకు రాక
### అక్కడి నుంచి సైకిల్‌పై పార్టీ కార్యాలయానికి చేరిక

**పాలకొల్లు,**

రెండో వారం 'నో వెహికల్ డే' సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు రైలులో ప్రయాణించారు. శుక్రవారం పాలకొల్లు నుంచి ట్రైన్‌లో సాధారణ ప్రయాణికులతో కలిసి విజయవాడకు మంత్రి చేరుకున్నారు. రామవరప్పాడు రైల్వే స్టేషన్ నుంచి మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయం వరకు సైకిల్‌పై వెళ్లారు. వరుసగా రెండో వారం కూడా నో వెహికల్ డే సందర్భంగా సుమారు 18 కిలోమీటర్ల మేర మంత్రి నిమ్మల సైకిల్ తొక్కారు. తాడేపల్లి దగ్గర నిమ్మలకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ స్వాగతం పలికారు. ఒకే సైకిల్‌పై ఇద్దరూ కూడా పార్టీ కార్యాలయానికి వెళ్లారు. జగన్ ఒక పిచ్చి తుగ్లక్ అంటూ మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు. పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. జగన్ మావిగన్ అంటే కూటమి భయపడటం లేదని.. ప్రజలే భయపడు తున్నారని తెలిపారు. అధికారం కోసం జగన్ ఎంతకైనా తెగిస్తారని మండిపడ్డారు. హత్యా రాజకీయాలు జగన్‌కు అలవాటన్నారు. అమరావతిలో జరుగుతున్న పనులు చూసి వైసీపీ అధినేతకు భయం మొదలైందని.. అందుకే అమరావతిపై విషం కక్కుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ మళ్లీ సీఎం అయితే పొట్టేలు తలల స్థానంలో ప్రజల తలలు నరుకుతారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌కు 11 సీట్లు కూడా రావని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.

# అభినయ దర్శన వ్యవహారంపై విచారణ

**విశాఖపట్నం,**

క్రైస్తవ మత ప్రచారకుడు, నటుడు అభినయ్ దర్శన్ వ్యవహారంపై హోం మంత్రి అనిత స్పందించారు. అభినయ్ దర్శన్ వ్యవహారంలో విచారణ జరుగుతోందని.. ఈ వ్యవహారంలో రాజకీయ కోణంపైనా పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిపారు. కుట్రకోణం లేకపోతే కడప నుంచి అల్లూరి జిల్లాకు రావాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. అమాయకపు గిరిజనులను అభినయ్ దర్శన్ నమ్మించి పాస్టర్ అవతారం ఎత్తారని.. ఆయనపై దాడి జరగకపోయినా జరిగిందని నమ్మించారన్నారు. అభినయ్ దర్శన్ వ్యవహారంలో ఎవరు ఉన్నారనేది త్వరలో బయటపడుతుందని తెలిపారు. దర్శన్‌పై క్రిమినల్ కేసులు ఉన్నాయని.. వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ప్రయత్నం చేశారని హోంమంత్రి వెల్లడించారు.

4
నల్లగొండ
ఆదివారం,
24 మే 2026

న్యూస్ వార్
వార్తా పత్రిక

## 137 మంది యువతకు జాబ్ ఆఫర్ లెటర్లు అందజేత

**ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలి : అడిషనల్ కలెక్టర్ పాండు**



ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ నెల 8న నిర్వహించిన జాబ్ మేళాలో వివిధ ప్రముఖ కంపెనీలకు ఎంపికైన 137 మంది అభ్యర్థులకు కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలు లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు జాబ్ ఆఫర్ లెటర్లను అందజేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ పాండు మాట్లాడుతూ, జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. జాబ్ మేళాల ద్వారా ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలను యువతకు చేరువ చేస్తున్నామని తెలిపారు. యువత తమ విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కేవలం ఉద్యోగం పొందడం మాత్రమే కాకుండా విధుల్లో క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేస్తే మరింత మంచి అవకాశాలు వస్తాయని అన్నారు. ఉద్యోగాల్లో చేరిన యువత తమ కుటుంబాల ఆర్థికాభివృద్ధికి తోడ్పడటంతో పాటు సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జీఎం తుల్జారాం నాయక్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, అభ్యర్థులు, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్ల పట్టివేత:



ఉట్కూరు: పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను లక్ష్మీపల్లి శివారులో పోలీసులు పట్టుకున్నారు. అనంతరం ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టగా, 01) లింగమోల్ల అశోక్, లక్ష్మీపల్లి, ఉట్కూర్ మండలం, 02) ఎం. విష్ణు, జేగిరం గ్రామం, యాద్గిరి జిల్లా, కర్ణాటక రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు. వారి పై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఉట్కూర్ ఎస్సై రమేష్ తెలిపారు. ఉట్కూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేపడితే, అట్టి వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

## ఎంపీ వద్దిరాజు ప్రకటన



ఎండలు రోజురోజుకు మరింత తీవ్రమవుతున్నందున అప్రమత్తంగా ఉండాల్సిందిగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ప్రజలను కోరారు. తెలంగాణ వ్యాప్తంగా ఎండలు మండిపోతుండడంతో వడదెబ్బ తగిలి పలువురు ప్రాణాలు కోల్పోయిన దృష్ట్యా అత్యవసరమయితే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని ఒక ప్రకటనలో ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సూర్యుడి ప్రతాపం రేపటి నుంచి మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని వాతావరణ కేంద్రం పేర్కొనడాన్ని ఎంపీ రవిచంద్ర గుర్తు చేస్తూ చిన్నపిల్లలు, వృద్ధులు తగు జాగ్రత్తలు పాటిస్తూ మంచినీళ్లు, మజ్జిగ ఎక్కువ తీసుకోవాలని సూచించారు. ప్రయాణీకులు, కార్మికులు, కర్షకులు, చిరు వ్యాపారులు మరింత జాగ్రత్తగా ఉండాలని, వడదెబ్బ తగిలినట్టయితే వెంటనే సమీపాన ఉన్న ఆస్పత్రికి వెళ్లి వైద్య సాయం పొందాలని ఎంపీ వద్దిరాజు సలహానిచ్చారు.

## కామ్రేడ్ మల్లెల.రామన్న ఆశయ సాధనకై పోరాడుదాం.

కామ్రేడ్ మల్లెల. రామన్న ఆశయ సాధనకై పోరాడాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపందా) జిల్లా కార్యదర్శి ముద్దా.బిక్షం, టియుసిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే. యాకూబ్బావలి అన్నారు. శనివారం కామ్రేడ్ రామన్న సంతాప సభ టియుసిఐ జిల్లా అధ్యక్షులు ఆర్. మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన మణుగూరు లోని గుట్ట మల్లారంలో జరిగింది. ఈ సంతాప సభలో వారు పాల్గొని మల్లెల రామన్న చిత్ర పటానికి పూలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామ్రేడ్ మల్లెల. రామన్న సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపందా), ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టి యు సి ఐ) కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ కార్మికుల, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేశాడని అన్నారు. దోపిడీ, పీడనలు లేని సమ సమాజ స్థాపన కోసం కలలు కన్నాడని అన్నారు. మణుగూరు ప్రాంతంలో పార్టీ విస్తరణకు, ట్రేడ్ యూనియన్ విస్తరణకు కృషి చేస్తున్న క్రమంలో ప్రమాదవ శాత్తు మరణించ డం బాధాకరమన్నారు. కామ్రేడ్ రామన్న మృతి మణుగూరు ప్రాంత పార్టీకి, ట్రేడ్ యూనియన్ కి, విప్లవో ద్యమానికి తీరని లోటు అన్నారు. కామ్రేడ్ రామన్న మృతి పట్ల సంతా పం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియ జేశారు. మణుగూరు ప్రాంతంలో పార్టీ ని, ట్రేడ్ యూనియన్ ను బలోపేతం చేసి బలమైన విప్లవోద్యమాన్ని నిర్మించడమే కామ్రేడ్ రామన్నకు ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. అందుకోసం పార్టీ, ట్రేడ్ యూనియన్ కార్యకర్తలు అందరూ కృషి చేయాల న్నారు. రామన్న ఆశయ సాధన కోసం పోరాడాలన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు వివేక్ వెంకటస్వామి మైనంపల్లి హనుమంతరావు చిత్రపటాలకు పాలభిషేకం



శ్రామకు తగ్గ ఫలితం ఇవ్వాలని చట్టాన్ని చేసిన శ్రమిక బంధువులు, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకట స్వామిని మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి కొనియాడారు. శనివారం పాలమాకుల గ్రామం లో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ వెంకట స్వామి, మైనంపల్లి హనుమంత రావు ఫోటో ఫ్లెక్సీ కి పాలాభిషేకంచేశారు. ఈకార్యక్రమనికి ముఖ్య అతిథులుగా మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి మాట్లాడుతూ ఏండ్ల తరబడి ఎదురుచూసిన కార్మిక వర్గానికి తెలంగాణ ప్రభుత్వం తియ్యటి వార్త చెప్పింది. దాదాపు 12 సంవత్సరాల తర్వాత కనీస వేతనాలపై సమగ్ర సవరణ చేపట్టి, శ్రామికుల జీవితాల్లో కొత్త ఆశలు నింపింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి చొరవతో తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్రంలోని 1.11 కోట్లకు పైగా కార్మిక కుటుంబాలకు నేరుగా లాభం చేకూర్చనుంది. పెరిగిన ధరలు, ఆకాశాన్నంటిన జీవన వ్యయంతో కార్మికులు కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్నారు. జీవన వ్యయం ఇబ్బడి ముబ్బడిగా పెరిగినా వారికి అందుతున్నది పాత వేతనాలే! ఇన్నాళ్లు ఇదే పరిస్థితి. ముఖ్యంగా అసం ఘటితరంగాల్లో పనిచేసే కార్మికుల జీవితం చేతికి వచ్చినది నోటికి సరిపోని స్థితికి చేరింది. ఇలాంటి సమయంలో ప్రభుత్వం కేవలం ఫైళ్ల పరిమితిలో కాకుండా, మానవీయ కోణంలో సమస్యను చూసి ప్రభుత్వంతో నిర్ణయం తీసుకునేలా మంత్రి వివేక్ కృషి హర్షణీయం. శ్రమకు తగిన గౌరవం రాష్ట్రంలోని 73 షెడ్యూల్డ్ ఉపాధి రంగాలకు కొత్త వేతన నిర్మాణం తీసుకురావడం ద్వారా 'కార్మి కుల శ్రమకు తగిన గౌరవం' అనేభావనకు ప్రభు త్వం కొత్త అర్థం చెప్పింది. అన్స్కిల్ట్ కార్మికులకు దాదాపు 35 శాతం వరకు వేతన పెంపు ఇవ్వడం చిన్న విషయం కాదు. సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్ వర్గాలకు కూడా గణనీయమైన పెంపులు ప్రకటించడం ద్వారా ప్రతి శ్రామిక కుటుంబా నికి భరోసా కల్పించింది. ఈ నిర్ణయంలో మరో ముఖ్యమైన విషయం సమతుల్యత అని స్పష్టం గా చెప్పవచ్చు. ఒకవైపు కార్మికుల సంక్షేమం మరోవైపు పరిశ్రమల అభివృద్ధి. రెండింటినీ సమన్వయం చేస్తూ ప్రభుత్వం ముందడుగువేసింది. ట్రేడ్ యూనియన్లు, పరిశ్రమల ప్రతిని ధులు, కోర్టుకేసులు, పొరుగు రాష్ట్రాల వేతనాలు, ద్రవ్యోల్బణ పరిస్థితులు అన్నింటినీ అధ్యయనం చేసిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నది. ప్రజల ప్రభుత్వం అంటే ఏమిటో రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరోసారి చాటిచెప్పిందనే అభిప్రాయం కార్మిక వర్గంలో వ్యక్తమవుతోంది. ఎన్నికల హామీలకే పరిమితం కాకుండా, శ్రామికుల జీవన ప్రమా ణాలు మెరుగుపడాలనే సంకల్పం ఈ నిర్ణయంలో స్పష్టంగా కనిపిస్తోంది. కార్మిక ఉద్యమంతో కాకా ప్రత్యేక అనుబంధంమంత్రి వివేక్ వెంకటస్వామికి కార్మిక ఉద్యమం తో ప్రత్యేక అనుబంధం ఉంది. కార్మికులతో వారి కుటుంబానిది పేగుబంధం. ఆయన తండ్రి, దివంగత నేత కాకావెంకటస్వామి జీవితాంతం కార్మికుల హక్కుల కోసం పోరాడిన నాయకుడు సింగరేణి నుంచి సిర్పూర్ వరకు కార్మికుల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి ఇప్పటికీ గుర్తుండేలా ఉంది. ఇప్పుడు అదే కుటుంబం నుంచి వచ్చిన వివేక్ వెంకటస్వామి కార్మికశాఖ మంత్రిగా ఉండి, శ్రామికులకు ఉపయోగపడే నిర్ణయాలు తీసుకోవడం కార్మిక వర్గంలో కొత్త నమ్మకాన్ని పెంచుతోంది. సంక్షేమం, సామాజిక న్యాయం, అభివృద్ధి ఈ మూడు లక్ష్యాలను ఒకే నిర్ణయంలో ప్రతిబింబింపజేసిన అరుదైన ఉదా హరణగా ఈ వేతన సవరణ నిలిచిపోనుంది. తెలంగాణలో ఇకపై కార్మికుడి చెమటకు విలువ ఉంది అనే భావన మరింత బలపడటం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. ఈమండల పార్టీ అధ్యక్షులు తప్పేట శంకర్, పాక్స్ డైరెక్టర్ గంగుల రవి, గ్రామ శాఖ అధ్యక్షులు భాస్వ రాజు రాములు, సందెబోయిన తిరుపతి, పొల్ల రాజు, సుద్దాల మహేందర్, వరదోల్ సంతోష్, భాస్వరాజు స్వామి, ఎండీ యాకుబ్ లు పాల్గొన్నారు.

# మల్కాపూర్ రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన మాజీ వైస్ ఎం.పీ.పీ వర్ధంతి

**మరణించి రెండు దశబ్దాలు గడిచినా ఇప్పటికి చెరగని ముద్ర**

**గ్రామంలో ఓటమి ఎరుగని ప్రజానాయకుడు**

**సర్పంచుగా, వైస్ ఎంపిపిగా చిరస్మరణీయ సేవలు**

**తండ్రి ఆశయాల వారసత్వంలో కుమారుడు ప్రవీణ్**







సుమారు 18 సంవత్సరాల పాటు మల్కాపూర్ గ్రామ రాజకీయాలను శాసించి, కొండాపూర్ మండలంలో ప్రముఖ కాంగ్రెస్ నాయకునిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దివంగత కొండాపూర్ మాజీ వైస్ ఎంపిపి, మల్కాపూర్ మాజీ సర్పంచ్ జోగన్నగారి నర్సింలు 20వ వర్ధంతి సందర్భంగా మల్కాపూర్ ప్రజలు ఆయన సేవలను స్మరించుకుంటున్నారు. 2006 మే 24న యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో ఆయన గుండెపోటుతో పరమపదించిన సంగతి తెలిసిందే. ఆయన మరణించి రెండు దశాబ్దాలు కావస్తున్నా, నేటికీ మల్కాపూర్ ప్రజల గుండెల్లో చెరగని ముద్రతో నిలిచే ఉన్నారు. సాధారణ కుటుంబం నుండి అసాధారణ నాయకుడిగా.. 1952లో పద్మశాలి కులానికి చెందిన వ్యవసాయ కూలీలుగా పనిచేసే లక్ష్మయ్య, లక్ష్మమ్మ దంపతుల ద్వితీయ సంతానంగా నర్సింలు గారు జన్మించారు. సంగారెడ్డిలో మెట్రిక్యులేషన్ పూర్తి చేసిన ఆయన, శ్రీమతి వెంకటమ్మ గారిని వివాహం చేసుకున్నారు. వీరికి నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు (ప్రవీణ్ ప్రస్తుత ఉపసర్పంచ్) ఉన్నారు. మొదట మల్కాపూర్ పోలీస్ పటేల్‌గా, ఆ తర్వాత పట్వారీగా కొన్ని సంవత్సరాలు సేవలు అందించిన నర్సింలు, ఆ తర్వాత ప్రజా జీవితంలోకి అడుగుపెట్టారు.

ప్రజల ఆశీస్సులతో విజయ పరంపర

– 1988: గ్రామపంచాయతి సాధారణ ఎన్నికలలో మల్కాపూర్ గ్రామ సర్పంచ్‌గా భారీ విజయంతో రాజకీయ ప్రస్థానం ప్రారంభం.

– ?1995: మెరుగైన పాలనతో గుర్తింపు తెచ్చుకుని, తన సహచరిణి శ్రీమతి వెంకటమ్మ గారిని మల్కాపూర్ ాలి మహిళా సర్పంచ్‌గా భారీ మెజారిటీతో గెలిపించారు. – ?2001: మల్కాపూర్ మరియు గిర్మాపూర్ గ్రామాల నుండి కాంగ్రెస్ ఎం.పీ.టీ.సీ (పూజ) గా విజయం సాధించి, కొండాపూర్ మండల వైస్ ఎం.పీ.పీ పదవిని అధిష్టించారు.

**గ్రామ అభివృద్ధిలో మైలురాళ్ళు..**

ఆయన పదవీకాలంలో మల్కాపూర్ రూపురేఖలు మారిపోయాయి. తాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు మంచినీటి ట్యాంకుల నిర్మాణం, బోర్లు వేయించి ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్ ఇప్పించారు. కొత్త రోడ్ల నిర్మాణం, మురుగునీటి కాలువలు, విద్యుత్ సౌకర్యం కోసం ప్రత్యేకంగా సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయించారు. అంతేకాకుండా, గ్రామస్తుల సహకారంతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కోసం ఒక ఎకరం స్థలాన్ని సమీకరించి విద్యాభివృద్ధికి బాటలు వేశారు. ఎన్నో ఆటంకాలను ఎదుర్కొని అమ్లెట్ గ్రామమైన వీరభద్రుని పల్లెకు రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. ముక్కుసూటి తనం.. న్యాయానికే పీఠం గ్రామంలో ఎలాంటి తగాదాలు జరిగినా పోలీస్ స్టేషన్ వరకు వెళ్లకుండా ఊర్లోనే పరిష్కరించేవారు. పంచాయితీల్లో ముక్కుసూటిగా మాట్లాడుతూ, కేవలం న్యాయం వైపు మాత్రమే నిలబడేవారు. తన హయాంలో పేదలకు సంపూర్ణ న్యాయం జరిగిందని, వారి జీవితాలు మెరుగయ్యాయని ఇప్పటికీ గ్రామ ప్రజలు గుర్తుచేసుకుంటుంటారు.

**తండ్రి ఆశయాల సాధనలో కుమారుడు 'ప్రవీణ్':**

జోగన్నగారి నర్సింలు గారి ఆశయాలను, ఆశీస్సులను ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన కుమారుడు ప్రవీణ్ రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఐటీ రంగంలో మంచి భవిష్యత్తు ఉన్నప్పటికీ, దాదాపు 16 సంవత్సరాల అనుభవం కలిగిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ 'కాగ్నిజెంట్' (జశీస్త్రఅఱఓఞఅ్) మేనేజర్ ఉద్యోగానికి రాజీనామా చేసి మల్కాపూర్ ప్రజాసేవకు అంకితమయ్యారు. గత నాలుగేళ్లుగా ప్రజల్లోనే ఉంటూ సేవ చేస్తున్న ప్రవీణ్, ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ స్థానం రిజర్వేషన్ కలిసిరాకపోయినప్పటికీ, తండ్రిలాగే గ్రామానికి సేవ చేయాలనే పట్టుదలతో వార్డు సభ్యుడిగా పోటీ చేసి, ఆపై మల్కాపూర్ ఉపసర్పంచ్‌గా ఎన్నికై తండ్రికి తగ్గ తనయుడిగా నిలిచారు. జోగన్నగారి నర్సింలు 20వ వర్ధంతి సందర్భంగా మల్కాపూర్ గ్రామస్తులు, నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించనున్నారు.

# పేదలకు ఆరోగ్య భరోసా.. 'సీఎంఆర్ఎఫ్'

## 150 మంది లబ్ధిదారులకు రూ.44 లక్షల చెక్కులు పంపిణీ చేసిన ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి

## ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాలు అందజేత

ఖమ్మం: కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రులలో అత్యవసర వైద్య చికిత్సలు చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం కొండంత అండగా నిలుస్తోందని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని గట్టయ్య సెంటర్ లో గల తన క్యాంప్ కార్యాలయంలో ఉభయ జిల్లాలైన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన 150 మంది లబ్ధిదారులకు తన సిఫారసుతో మంజూరైన రూ.44 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను ఆయన పంపిణీ చేశారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి మద్దినేని స్వర్ణకుమారి లతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ?ఈ సందర్భంగా ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ.. పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ, లబ్ధిదారుల దరఖాస్తులను వేగవంతంగా పరిశీలించి సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్క పేదవానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించి, అండగా నిలవడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన వివరించారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులంతా ఈ సందర్భంగా ఎంపీ రఘురాం రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

**ఆటో డ్రైవర్లు, కార్మికులకు అండగా ఉంటాం**

అనంతరం వివిధ ఆటో అడ్డాలకు చెందిన వందమంది ఆటో డ్రైవర్లకు ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి ఖాకీ చొక్కాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో నిరంతరం శ్రమిస్తూ రవాణా రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆటో కార్మికులందరికీ తమ ప్రభుత్వం, తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని అభయమిచ్చారు. ఈ కార్యక్రమాల్లో..: నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దీపక్ చౌదరి, కాంగ్రెస్ నాయకులు కొప్పుల చంద్రశేఖర్, టెలిఫోన్ అడ్వైజర్ కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, రంజిత్ నాయక్, సీనియర్ నాయకులు వడ్డెబోయిన నరసింహారావు, మాజీ ఎంపీపీ గోసు మధు, డీసీసీ సెక్రెటరీ రాంపుడి రోశయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ గుమ్మా రోశయ్య, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు ఎస్డి. గౌస్, కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, స్ఫూర్తి ఓం రాధాకృష్ణ, చల్లా రామకృష్ణా రెడ్డి, కేకేసీ జిల్లా అధ్యక్షులు విప్లవ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు జంగిపల్లి ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు బాణాల లక్ష్మణ్, మల్లెల నాగేశ్వరరావు, కాటేపల్లి పాల్గొన్నారు.

Edited, Printed, Published & Owned by NATAVA KRISHNA RAO, Published from: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255, Telangana, Printed at: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255,Telangana, Editor:NATAVA KRISHNA RAO, Cell: 9440991979,